# సాక్షి ఒడిశా

గురువారం । 5 । జూన్ । 2025






**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,96,644లు, బంగారం 3 గ్రాముల 750 మిల్లీగ్రాములు, వెండి 11 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**అర్హులందరికీ భూమి**

రాష్ట్రంలో అమలు చేయనున్న రెవెన్యూ సంస్కరణలలో భాగంగా అర్హులందరికీ భూమి అందుతుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు.

-12లో



**మాదకద్రవ్యాలతో అనర్థం**

మాదక ద్రవ్యాల వినియోగంతో యువత బంగారు భవిష్యత్ అంధకారమవుతుందని కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు.

-12లో

## న్యూస్‌రీల్

### గంజాయితో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన నిందితులు

పర్లాకిమిడి: జిల్లా అబ్కారీ సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్ సాహు ఆదేశాల మేరకు మొబైల్ యూనిట్ గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. దీనిలో భాగంగా పర్లాకిమిడి కొత్త బస్టాండ్, భవానీ టాకీస్ వద్ద బైక్‌పై గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 52 కిలోల గంజాయి, బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమార్ పటేల్, యస్సై మిఝి శోబోరో, మోడల్ ఇన్‌స్పెక్టర్ మోనూ ఆయాల్ తదితరులు పాల్గొన్నారు.

### నాటుసారా తరలిస్తున్న ముగ్గురు అరెస్టు



ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడిన నిందితులు

జయపురం: నాటుసారాను అక్రమంగా తరలిస్తూ వ్యాపారం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయపురం అబ్కారీ అధికారి సుబ్రత కేశరీ హరిస్ బుధవారం తెలిపారు. అరెస్టయిన వారిలో జయపురం సమితి గొడాపాదర్ పంచాయతీ దుబులి గ్రామానికి చెందిన త్రినాథ్ పొరజ, జయపురం సబ్‌డివిజన్ నువాగుడ వాసి ఆకాశ హరిజన్, నువాపుట్ గ్రామ వాసి ఈశ్వర బిశాయి ఉన్నారన్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్టు సుబ్రత్ కేశరీ హరిష్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ అధికారి హరిష్, ఏఎస్సై బలరాం దాస్‌లు తమ సిబ్బందితో పెట్రోలింగ్ జరుపుతుండగా నాటుసారా తీసుకెళ్తున్న ముగ్గురు పట్టుబడినట్టు పేర్కొన్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

### పక్షులకు గూడు



పక్షిగూడు సిద్ధం చేస్తున్న సభ్యులు

రాయగడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉత్కళ మీడియా పాత్రికేయుల సంఘం సభ్యులు బుధవారం స్థానిక సర్క్యూట్ హౌస్ ప్రాంగణంలోని చెట్లపై నివసిస్తున్న పక్షులకు గూడ్లు ఏర్పాటు చేశారు. పక్షులను సంరక్షించే ప్రక్రియలో భాగంగా ప్రతి ఏడాది ఇటువంటి తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సభ్యులు మనోజ్ కుమార్ సాహు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కృష్ణపద్ మృతదేహం



మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కలిమెల వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. బైక్‌పై వస్తున్న కృష్ణపద్ (42) మృతి చెందారు. కృష్ణపద్ మల్కన్‌గిరి సమితి ఎం.వి 22 గ్రామానికి చెందిన వ్యక్తి. మల్కన్‌గిరి ఐఐసీ రీగా నీకిండో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి టిప్పర్ డ్రైవర్‌ను అరెస్టు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# మరణ మృదంగం

- కొరాపుట్ వైద్య కళాశాల ఆస్పత్రిలో దారుణం
- మంగళవారం అర్ధరాత్రి ఆరుగురు రోగులు మృత్యువాత
- వైద్య వికటించడం వల్లేనంటున్న బాధిత కుటుంబాలు
- అవన్నీ సహజ మరణాలే: ప్రభుత్వం



మాట్లాడుతున్న కళాశాల సూపరింటెండెంట్ సుశాంత్



భగవాన్ పరజా మృతదేహం



శుక్ర మజ్జి మృతదేహం



పుల్మతి మజ్జి మృతదేహం



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం



ఆసుపత్రిలో రోగుల బంధువులు

కొరాపుట్:

కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి 11 నుంచి బుధవారం వేకువజాము వరకు ఆరుగురు రోగులు మృత్యువాతపడ్డారు. వైద్యం వికటించడం వల్లే ఈ మరణాలు సంభవించాయని బాధిత కుటుంబాలు ఆరోపణలు చేస్తుండగా.. అవన్నీ సహజ మరణాలు అయి ఉండవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఈ విషాద ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. మృతుల్లో నలుగురు ఐసీయూలో ప్రాణాలు వదలడం వివాదాస్పదంగా మారింది. మృతుల్లో భగవాన్ పరజా (68), శుక్ర మజ్జి (45), జగన్నాథ్ పూజారి (54), రుకుని పెంటియా (47), బాటి ఖురా(36), పుల్మతి మజ్జి (29)లుగా ప్రభుత్వం ప్రకటించింది. వీరందరూ అత్యవసర చికిత్స కోసం వచ్చారు. కేవలం గంటన్నర వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోయారు.

**దర్యాప్తుకు ఆదేశం..**

విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు రుపక్ తురుక్, మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్ తదితరులు ఆస్పత్రికి చేరుకొని ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే పోలీసు బలగాలను మోహరించారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తివాసన్ కళాశాలకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మరణాలపై పూర్తిస్థాయి విచారణ చేస్తామన్నారు. ఇవి సహజ మరణాలుగానే అనుమానం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఉన్నత స్థాయి దర్యాప్తు జరుగుతుందన్నారు. తనకు వైద్య పరిజ్ఞానం లేదని, అందుకే ఇప్పుడే ఏం చెప్పలేనన్నారు. కళాశాల సూపరింటెండెంట్ సుశాంత్ మాట్లాడుతూ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తామన్నారు.10 మంది వైద్య నిపుణులతో ప్రత్యేక కమిటీతో దర్యాప్తు చేస్తామన్నారు. మరోవైపు రోగుల బంధువులు మీడియాతో మాట్లాడుతూ ముగ్గురు నర్సులు వచ్చి ఇంజక్షన్లు చేశారని, ఇంజక్షన్లు ఇచ్చిన తర్వాత ప్రతి ఐదు నిమిషాలకు ఒక్కొక్కరూ మృతి చెందారని చెప్పారు. కాగా, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10 వేలు చొప్పున అందజేసింది.



బాధితులకు పరిహారం పంపిణీ చేస్తున్న దృశ్యం



బాటిఖురా మృతదేహం



ఆస్పత్రి బయట బంధువుల రోదనలు

## నవ దంపతుల ఆత్మహత్య

రాయగడ: ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో రెండు నెల క్రితం సంప్రదాయంగా వివాహం చేసుకున్నారు. ఇంతలో ఏ కష్టమొచ్చిందో గానీ ఇద్దరూ ఒకే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన కాసీపూర్ సమితి ఒంద్రాకంచ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాయికొకుపాకల్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అభి జొడియా (26), అమిత జొడియా (23)లు గ్రామ శివారులో చెట్టుకు వేలాడుతూ విగతజీవులుగా కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను కాసీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టుకు వేలాడుతున్న మృతదేహాలు

## ఆవుల అక్రమ తరలింపునకు చెక్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆవులు

- 76 ఆవులు స్వాధీనం
- ముగుర్గు అరెస్టు

జయపురం: ఆవుల అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బి.సింగపూర్ వద్ద మంగళవారం సాయంత్రం కొంతమంది అక్రమంగా గోవులను తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి 75 ఆవులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసిటన్టు బుధవారం తెలిపారు. జయపురం సమితి జయంతిగిరి సంత నుంచి ఆవులను నడిపించుకుంటూ బొరిగుమ్మ రాణిగుడ మార్గం గుండా కొరాపుట్ వైపు తీసుకెళ్తుండగా బిసింగపూర్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో సెమిలిగుడ వ్యాపారి ఒకరు ఉన్నట్టు వెల్లడించారు. ఆవులను జయంతిగిరి వారపు సంత నుంచి బొరిగుమ్మ, రాణిగుడ మీదుగా కుందులి సంతకు వెళ్లి అచ్చట నుంచి ఆవులను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు తీసుకెళ్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. జిల్లాలో గోవుల రవాణాపై అధికారులు ఆంక్షలు విధించినప్పటికీ అనేక మార్గాలలో వ్యాపారులు గోవులను తరలిస్తున్నారని పోలీసులు వెల్లడించారు. కొరాపుట్ జిల్లాలో గోవులను సేకరించి వాటిని పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. గత మే నెలలో పలుసార్లు గోవుల రవాణా చేస్తూ అనేక మంది పోలీసులకు చిక్కిన విషయం విదితమే. గత మే 27వ తేదీన పశువులు రవాణా చేసే కంటైనర్‌లను పట్టుకొని 210 పశువులను పట్టుకున్న సంఘటనలో 17 మందిని అరెస్టు చేశారు. ఈ సంఘటన మరువక ముదే మంగళవారం సాయంత్రం 76 ఆవులతో ముగ్గురు పట్టు బడ్డారు.

## విజిలెన్స్ వలలో ఏఎస్ఐ

- రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



ఏఎస్ఐ బబిత సునా

రాయగడ: పది వేల రుపాయల లంచం తీసుకుంటూ విజిలెన్స్ వలకు చిక్కారు బరంపురం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బబిత సునా. ఓ కేసుకు సంబంధించి మహిళను బరంపురం మహిళా పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చేసి ఉంచారు. ఈ కేసును బబిత విచారిస్తున్నారు. కేసు నుంచి తప్పించుకోవాలంటే అందుకు రూ.10 వేలు చెల్లించాలని, లేదంటే వేరే కేసులపై అరెస్ట్ అయ్యే అవకాశం ఉందని బబిత చెప్పారు. బాధితురాలు ఈ మేరకు విజిలెన్స్ అధికారులను ఆశ్రయించాడు. వల పన్నిన విజిలెన్స్‌శాఖ అధికారులు ఏఎస్ఐ లంచం తీసుకుంటుండగా బుధవారం పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేశారు.

### జావెలిన్ త్రోలో సుచిత్రకు రజతం



సుచిత్ర పరిడా

భువనేశ్వర్: ప్యారిస్‌లో జరుగుతున్న పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025లో జావెలిన్ త్రో ఈవెంట్‌లో ఒడియా క్రీడాకారిణి సుచిత్ర పరిడా రజత పతకం గెలుచుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సుచిత్రను అభినందించారు. ఆమె విజయం ఒడిశాకే కాదు సమగ్ర భారతదేశానికే గర్వకారణమని పేర్కొన్నారు.

## తుపాకులు కలిగి ఉన్న ఇద్దరు అరెస్టు





అరెస్టయిన ప్రతాప్ గోమాంగో, అరుణ్ గోమాంగో



పర్లాకిమిడి: అనుమతి లేకుండా తుపాకులు కలిగి ఉన్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి ఆదర్శపోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రఫుల్ల జగరంగ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుసాని సమితి తులసిపాడు, డాక్టర్ బంజిరి వద్ద ఇద్దరు వ్యక్తులు ఎస్‌బీఎంఎల్ (సింగిల్ బ్యారిల్ లోడింగ్) తుపాకులతో పట్టుబడ్డారు. వీరిని పోలీసులు విచారించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారిని అదుపులోకి తీసుకుని పర్లాకిమిడి ఆదర్శ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో రాయగడ జిల్లా పుట్టాసింగి పంచాయతీ రెజింగ్‌తల్ గ్రామానికి చెందిన అరుణ్ గోమాంగో, ప్రతాప్ గోమంగోగా పోలీసులు గుర్తించారు. వారిపై 112/2025, సెక్షన్.25(1)(ఎ) ఆర్మ్స్ చట్టం క్రింద అరెస్టు చేసి బుధవారం ఉదయం కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ రక్షణ కింద నిందితులను అదుపులోకి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలిపారు.

## వైద్యుల నిర్లక్ష్యానికి బాలుడి మృతి




రక్తనిధి కేంద్రం వద్ద ఆందోళన చేపట్టిన బాధిత కుటుంబీకులు

రాయగడ : వైద్యుల నిర్లక్ష్యం వల్ల బాలుడు మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు బ్లడ్‌బ్యాంక్ వద్ద ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బుధవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక న్యూకాలనీలో నివాసముంటున్న మధుసూదన్ టకిరి కుమారుడు తొమ్మిదేళ్ల రాజీవ్ టకిరి రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. జ్వర తీవ్రత పెరగడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బాలుడికి రక్తం తక్కువగా ఉందనే, వెంటనే రక్తాన్ని ఎక్కించాల్సి ఉందని వైద్యులు సూచించారు. బాధితులు వెంటనే రక్త నిధికి వెళ్లగా నిల్వలు లేవని చెప్పడంతో కుటుంబ సభ్యులకు ఏం చేయాలో తెలియక అక్కడే ఉండిపోయారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు రక్తనిధి కేంద్రం డాక్టర్ గౌతం పట్నాయక్ వచ్చి అవసరమైన రక్తం ఉందని చెప్పి రాజీవ్‌కు రక్తం ఎక్కిస్తుండగా బాలుడు మృతి చెందాడు. దీంతో కోపోద్రిక్తులైన బాధిత కుటుంబీకులు రక్తం రాత్రి లేదని చెప్పి.. తెల్లవారే సరికి ఎక్కడి నుంచి వచ్చిందంటూ ఆందోళనకు దిగారు. రాత్రే రక్తం ఎక్కిస్తే తమ కొడుకు బతికేవాడంటూ విలపించారు. స్థానిక సేవా సంస్థలు విరివిగా బ్లడ్ డొనేషన్ శిబిరాలు నిర్వహిస్తూ ఆయా సంస్థలు సేకరించిన రక్త యూనిట్లను ప్రభుత్వ రక్తనిధికి తరలిస్తుంటే.. ఇక్కడ రక్తం లేదని చెప్పడం తగదని మండిపడ్డారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేశారు.

## క్లుప్తంగా

### బంగారం దుకాణం యజమానిపై దాడి




ప్రసాద్ బంగారం దుకాణం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో మెయిన్ రోడ్డులో ఉన్న ప్రసాద్ బంగారం దుకాణం యజమానిపై దాడి జరిగింది. దుకాణాన్ని ముసేవేసి బంగారంతో ఉన్న బ్యాగ్‌తో ఇంటికి వెళ్తున్న యజమాని ప్రసాద్ పేల్‌పై ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండుగులు దాడి చేశారు. అతని చేతిలో ఉన్న బ్యాగ్‌ను దుండగులు లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితుడు వెంటనే మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాధు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌డీపీవో దివ్యడలై, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గతంలో కూడా ప్రసాద్ ఇంట్లో బంగారం చోరీకి గురైంది.

### యాదవుల కలశ యాత్ర



కలశలను ఊరేగిస్తున్న యాదవులు

రాయగడ: జమ్ముాకశ్మీర్ నుంచి బయలు దేరి రాయగడకు చేరుకున్న కలశయాత్రకు ఉత్కళ యాదవ సంఘం రాయగడ శాఖ సభ్యులు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. జమ్ముాకశ్మీర్‌లో అఖిల భారతీయ యాదవ సంఘం చేపట్టిన ఈ కలశ యాత్ర ఊరేగింపులో భాగంగా ఇక్కడకు చేరుకొని ప్రధాన వీధుల మీదుగా రాయగడ కళాశాల సమీపంలోని రాధా కృష్ణ మందిరం వరకు కొనసాగింది. కార్యక్రమంలో గోపాల్ సంఘం యువ విభాగం అధ్యక్షుడు అమర్ గోపాల్, జిల్లా కార్యదర్శి ప్రతాప్ చంద్ర గౌడో, కోఆర్డినేటర్ గోపినాథ్ గౌడో పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాలతో అనర్థం



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్నాయి

రాయగడ: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత బంగారు భవిష్యత్ అంధకారమవుతుందని కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం జిల్లా అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది రోజుల పాటు జిల్లాలో పర్యటిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలను చైతన్యపరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అబ్కారీ శాఖ అధికారి సంతోష్‌కుమార్ ధల్, ఆర్‌టీఓ రాజ్‌కిషోర్ బెహరా, జిల్లా విద్యాశాఖ అధికారి రామ నాహక్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ భవన నిర్మాణం అడ్డగింత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని కేటీ రోడ్‌లో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిర్మితమవుతున్న అక్రమ భవన నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ బేఖాతరు చేసి సదరు బిల్డింగ్ యజమాని నిర్మాణ పనులను కొనసాగిస్తుండగా, కమిషనర్ నడిపిన రామారావు ఆదేశానుసారం పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ సిబ్బంది సదరు నిర్మాణ పనులను బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పురపాలక సంఘంలో ఎవరైనా అక్రమ నిర్మాణాలను చేస్తే సదరు బిల్డింగ్ యజమానులపై కేసులు వేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అక్రమ భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, నిబంధనల మేరకు నడుచుకోవాలని హెచ్చరించారు.

### గుండెపోటుతో కళాకారుడు మృతి



కల్యాణ్ మృతదేహం

కంచిలి: గ్రామదేవత ఉత్సవాల్లో స్టేజీ ప్రోగ్రామ్ ఇచ్చేందుకు వచ్చిన ఒక కళాకారుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన బుధవారం కంచిలిలో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి కంచిలి ఉత్సవాల్లో భాగంగా సినీ డూప్స్ స్టేజ్ ప్రోగ్రాం ఇచ్చేందుకు కళాకారుల బృందం ఉదయమే వచ్చారు. వీరు మంగళవారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడలో ప్రదర్శన ఇచ్చి, అటునుంచి ఇక్కడికి వచ్చారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకోడానికి స్థానిక మఠం చెరువు వద్దకు వెళ్లారు. వీరిలో బాలకృష్ణ డూప్‌గా నటిస్తున్న సప్ప కల్యాణ్(65) చెరువు గట్టు మీద ఒక చెట్టుకింద కూర్చొని గుండెనొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. ఇతనిది విశాఖపట్నం జిల్లా గాజువాక పెద్దగంట్యాడ ప్రాంతం. తోటి కళాకారుడు మృతి చెందడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఈ ప్రదర్శనను రద్దు చేశారు.

# అర్హులందరికీ భూమి

- ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి
- రెవెన్యూ వర్క్‌షాప్ ప్రారంభం



సమావేశానికి హాజరైన రెవెన్యు అధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: రెవెన్యు విభాగం పాలనా వ్యవస్థలో తహసీల్దార్లు వెన్నెముక వంటివారని, ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించడానికి ప్రయత్నించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. తహసీల్దారు కార్యాలయం ప్రజలకు భయానక ప్రదేశంగా కాకూడదని, నమ్మకమైన ప్రదేశంగా ఉండాలని చెప్పారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో బుధవారం రాష్ట్ర రెవెన్యూ అధికారుల సమావేశం, వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ భూముల నిర్వహణ వ్యవస్థని ఆధునీకరించి ప్రజా ఆధారితంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. దీని ప్రకారం ఒడిశాలో ఎవరూ భూమి లేనివారుగా ఉండరని హామీ ఇచ్చారు. 4 డెసిమల్ కంటే తక్కువ భూమి ఉన్న వారిని కూడా భూమి లేనివారిగా పరిగణిస్తారని, ప్రభుత్వం వారికి సైతం భూమిని అందిస్తుందని చెప్పారు. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో రెవెన్యు అధికారుల పాత్ర కీలకమన్నారు. విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉందని, అక్రమార్కుల నుంచి ఆ ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకుని సద్వినియోగపరచాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం రెవెన్యూ రంగాలలో అనేక సంస్కరణలను తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. గిరిజనులు, షెడ్యూల్డ్ కులాల భూముల అమ్మకం, కొనుగోలులో తరచుగా అక్రమాలు జరుగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు నిర్ధారిత కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) ప్రకారం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి మాట్లాడుతూ విధి నిర్వహణలో సాధారణ పని పద్ధతులను మార్చుకుని సరికొత్త ఆలోచనా విధానంతో ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దేవరంజన్ కుమార్‌సింగ్, కేంద్ర రెవె న్యూ కమిషనర్ బి.డెమిరియన్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్, అన్ని జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అక్రమాలపై ఎమ్మెల్యే ఆగ్రహం



సమావేశంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తదితరులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి సమావేశం బుధవారం జరిగింది. సమితి అధ్యక్షులు దీప్తిమయి నాయిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమితిలో జరిగిన అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు నకిలీ బిల్లుల సమర్పించి నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. అటువంటి సంఘటనలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు నల్లబజారులో విక్రయిస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నల్ల బజారుపై చర్యలు చేపట్టాలని వ్యవసాయ విభాగ అధికారులను ఆదేశించారు. అలాగే సమితి విద్యా వ్యవస్థపై ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు విద్యాధికారి సుభాష్ చంద్ర మరియు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కమత, బొరిగుమ్మ రైతులకు వెంటనే రెండు వేల బస్తాల డీఏపీ ఎరువులు సమకూర్చాలని ఫోన్ ద్వారా మార్క్‌ఫెడ్ అధికారిని ఆదేశించారు. 2020 నాటికి పూర్తి కావలసిన మెగా తాగునీటి ప్రాజెక్టు నేటికీ పూర్తికాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటర్ ప్రాజెక్టుపై సమితి సభ్యుల ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు నలుగురుతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేయాలని బీడీవో సుకాంత కుమార్ పట్నాయక్‌ను ఆదేశించారు. సమావేశంలో నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి రామేశ్వర జెన, కొరాపుట్ ఎంపీ ప్రతినిధి రామ చంద్ర పాఢి, సమితి ఉపాధ్యక్షులు రాధాకాంత సామంతరాయ్, జిల్లా పరిషత్ సభ్యులు ప్రసాద్ బిడిక, నృశింహనాత్ శతపతి, బొరిగుమ్మ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్, డిక్టర్ దిలీప్ కుమార్ నాథ్, సీడీపీవో గాయిత్రీ బాహిణీపతి, ఇంజినీర్ సత్యనారాయణ సెటి పాల్గొన్నారు.

## మద్యం దుకాణాన్ని మూసివేయండి

రాయగడ: రథయాత్ర జరిగే తొమిది రోజులపాటుగా స్థానిక ఎస్‌బీఐ కూడలికి ఎదురుగా ఉన్న మద్యం దుకాణాన్ని మూసివేయాలని డిమాండ్ జిల్లా వికాష్ మంచ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లా అబ్కారీ శాఖ అధికారి సంతోష్ కుమార్ ధల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మంచ్ అధ్యక్షుడు దయానిధి ఖడంగ నేతృత్వంలో మంచ్ సభ్యులు మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన ప్రారంభమయ్యే రథ యాత్ర జరిగే తొమ్మిది రోజులు భక్తులతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుందన్నారు. కూడలిలోని మద్యం దుణానాన్ని మూసివేస్తే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## రైతు చైతన్య రథం ప్రారంభం



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ శౌశ్య రెడ్డి

జయపురం: జయపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రైతు చైతన్య రథాన్ని సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డి జెండా ఊపి ప్రారంభించార. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎలా విక్రయించాలో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సంచరిస్తుంది. ప్రతి సమితిలో మూడు రథాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రైతుల సౌలభ్యం కోసం మండీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏ మండీలో గిడ్డంగి సౌకర్యం లేదో అక్కడ ధాన్యం తడవకుండా తార్పలిన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షంనీరు నిల్వ ఉండకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు సబ్‌కలెక్టర్ వెల్లడించారు. టోకెన్ ఉన్న రైతులందరి నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్ట చేశారు. రైతులు ధాన్యం శుభ్రపరిచి తీసుకు రావాలని సూచించారు. ధాన్యం అమ్మకంలో ఎటువంటి సమస్య ఎదుర్కొన్న వెంటనే కంట్రోలు రూంకు ఫోను ద్వారా తెలియజేయాలన్నారు. రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎంసీ కార్యదర్శి డైరెక్టర్లు బాలా రాయ్, దేవేంద్ర బాహిణీపతి, నవీణ నాయిక్ పాల్గొన్నారు.

## తులసీ పాహడ్‌లో కలెక్టర్ పర్యటన



కిరిమెట్ల గ్రామంలో రహదారి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తులసీ పాహడ్‌లో కలుక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ తొలిసారిగా పర్యటించారు. ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న ఈ పర్వత ప్రాంతాల్లో జనం భయంభయంగా బతికేవారు. ప్రస్తుతం మావోయిస్టుల ప్రాబల్యం తగ్గడంతో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. ఇక్కడి పిల్లలు సైతం పాఠశాలల్లో చేరుతున్నారు. ఈ తరుణంలో కలెక్టర్ టిమురుపల్లి పంచాయతీ తులసీ, కీరమెట్ల, మారియా బెడా, చేరుకట్లా తదితర గ్రామాల్లో పర్యటించారు. పాఠశాలలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అంతకుముందు తులసీ పాహడ్ వద్ద బీఎస్‌ఎఫ్ క్యాంపును సందర్శించారు. కార్యక్రమంలో ఎస్పీ వినోద్ పటేల్, మత్తిలి గ్రామీణాభివృద్ధి విభాగం అధికారి కార్తీక్ నాయిక్, మత్తిలి బీడీఓ ప్రమోద్ కుమార్ బెహరా, సమితి ఈఈ హృదయ రంజన్ బాఘ్, ఏపీఓ లింగరాజ్ కరకరియా, సర్పంచ్ తుంబేశ్వర్ సమార్థ్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తుకు దూరంగా ఉండాలి



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అధికారులు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ సిబ్బంది మాదక ద్రవ్యాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన చైతన్యరథాన్ని జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధన్ బుధవారం ప్రారంభించారు. ఈ రథం ద్వారా మాదక ద్రవ్యాల వినియోగంతో వాటిల్లే నష్టంపై ఏడు సమితుల్లోని 111 పంచాయతీల్లో ప్రచారం చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి బింబధర్ పండా, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మించారు.. రోడ్డు మరిచారు..!



బ్రిడ్జి పైనుంచి గ్రామస్తులు రాకపోకలు కొనసాగిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కెరడ సమితి పరిధిలోని కిలిమిసిగుడ గ్రామస్తులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామ ప్రజలు సమితి కేంద్రానికి రావాలంటే మధ్యలోని నాగావళి నదిని దాటుకుంటూ వెళ్లాల్సిందే. అయితే గ్రామస్తులు అవస్థలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టింది. అయితే బ్రిడ్జి పనులు పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా అందుకు సంబంధించి ఇంతవరకు అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టక పోవడంతో గ్రామస్తుల రాకపోకలు నరకంగా మారాయి. వర్షాకాలం ముందుగా రోడ్డు పనులు పూర్తి చేయకపోతే వీరికి నరకయాతన తప్పదు. అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# దేశానికి బలం ప్రజలే



ఉత్కర్ష నిమాపడా కాంక్లేవ్‌ను ప్రారంభించిన గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి



కార్యక్రమానికి హాజరైన స్థానికులు

భువనేశ్వర్: రైతులు, స్వయం సహాయక బృందాల మహిళలు, యువత, ఉపాధ్యాయులు, చేతివృత్తుల వారు.. ఇలా అన్ని వర్గాల ప్రజలే దేశానికి బలమని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన ఉత్కర్ష నిమాపడా కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. సమ్మిళిత వృద్ధి, స్థానిక ఆకాంక్షలకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. ప్రజా కేంద్రీకృత అభివృద్ధికి అర్థవంతమైన ఆవిష్కరణకు దోహదపడే ఈ చొరవను కార్యరూపం దాల్చడంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడాను ఆయన ప్రశంసించారు. ఈ ప్రాంతంలో యువతకు సాధికారత కల్పించి స్థానిక ప్రతిభను వెలుగులోకి తెచ్చే స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఇటువంటి కార్యక్రమాలు వారధిగా నిలుస్తాయని ప్రోత్సహించారు. వ్యవసాయ కార్యకలాపాల ఆధునికీకరణ, డిజిటల్ వృద్ధి విస్తరణతో సమగ్ర సామర్థ్యత ఆవిష్కరణకు మార్గం సుగమం చేస్తుందన్నారు. గత 11 నెలల్లో రాష్ట్రం సమగ్ర వృద్ధిలో వ్యవసాయం, పర్యాటకం, మహిళలు, పిల్లలు వంటి కీలక రంగాల అభివృద్ధి, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లు, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు గణనీయమైన పురోగతిని సాధించాయని వివరించారు. కార్యక్రమానికి సారథ్యం వహించిన ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఈ సమావేశాన్ని నిమాపడా పురోగతికి ఒక మేలుకొలుపుగా అభివర్ణించారు. 2036 నాటికి అభివృద్ధి చెందిన ఒడిశా రూపకల్పనకు నిమాపడా కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు స్పష్టమైన ప్రణాళికను రూపొందించడంలో ఈ చర్చలు సహాయపడతాయని పేర్కొన్నారు. జగత్‌సింగ్‌పూర్ లోక్‌సభ సభ్యుడు బిభు ప్రసాద్ తొరాయ్ ఈ సభలో ప్రసంగించారు. పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వంయి, సత్యబాది నియోజకవర్గ ఎమ్మెల్యే ఓం ప్రకాష్ మిశ్రా, పూరీ ఎమ్మెల్యే సునీల్ మహంతి, బ్రహ్మగిరి ఎమ్మెల్యే ఉపాసన మహాపాత్రొ, సీనియర్ ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రథచక్రాలు సిద్ధం



వరుస క్రమంలో నిలిచిన దేవీ సుభద్ర రథం దర్ప దళనం చక్రాలు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ స్వామి యాత్రకు మూడు భారీ రథాల చక్రాల తయారీ పనులు పూర్తయ్యాయి. దీంతో శ్రీ మందిరం సింహద్వారం అభిముఖంగా చేరేందుకు వీలుగా ఇరుసుకు అమరిన చక్రాల్ని సురక్షితంగా తరలించి క్రమ పద్ధతిలో నిలిపారు. రథాల తయారీ ప్రాంగణంలో నిత్యం రెట్టింపు ఉత్సాహంతో పనులు పుంజుకుంటున్నాయి. దశల వారీగా రథాల తయారీ పనులు నిరవధికంగా సాగుతున్నాయి. చక్రాల తయారీ తర్వాత ఇరుసుతో అనుసంధానం కీలకమైన దశ. తదనంతరం ఒక్కో ఇరుసుకు చక్రాల్ని అమర్చడం బృహత్ ప్రక్రియ. ఇదంతా ముగియడంతో తదుపరి పనులకు అనుకూలతకు అనుగుణంగా చక్రాల్ని క్రమ పద్ధతిలో సురక్షితంగా తరలించి సింహ ద్వారం ముంగిటకు చేర్చడం సవాలుతో కూడిన ప్రక్రియ.

భోయ్, మహరణ, వర్గం సేవకుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియని బుధవారం విజయవంతంగా ముగించారు. తొలుత బలభద్ర స్వామి తాళ ధ్వజం తరువాత జగన్నాథుని నందిఘోష రథం చివరగా దేవీ సుభద్ర దర్ప దళనం రథానికి వరుస క్రమంలో అన్ని చక్రాల్ని ఇరుసుకు జోడించారు. అనంతరం మూడు రథాల అధిపతి మహారణ, భోయ్ సర్దార్ రవి భోయ్ ఆధ్వర్యంలో మూడు రథాల చక్రాల తరలింపు దిశను నిర్ణయించారు. రథ యాత్ర ముందురోజున స్వామి ఆగమనం కోసం శ్రీ మందిరం సింహద్వారం ముంగిటకు ఎటువంటి అడ్డంకులు లేకుండా రథాల్ని తరలించేందుకు వీలుగా రథ తయారీ శాల ఆవరణ నుంచి తరలించారు. తదుపరి కార్యకలాపాలకు అంతరా యం తలెత్తకుండా చక్రాలు స్థిరంగా ఉండేందుకు వీలుగా పతి చక్రానికి ఇరువైపులా మామిడి చెక్కల్ని అడ్డుగా ఏర్పాటు చేశారు.



చక్రాల్ని తరలిస్తున్న భోయి సేవకులు



వరుస క్రమంలో నిలిచిన రథ చక్రాలు

# త్యాగం చేశాం.. న్యాయం చేయండి

- ఆఫ్‌షోర్ నిర్వాసితుల విన్నపం



వినతిపత్రాలు అందజేస్తున్న నిర్వాసితులు

మెళియాపుట్టి: రేగులపాడు ఆఫ్‌షోర్ కోసం సర్వం త్యాగం చేసిన తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. చీపురుపల్లిలో నిర్వాసితులు చేపడుతున్న దీక్ష శిబిరాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తిలు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి నిర్వాసితులు వినతిపత్రాలు అందజేశారు. ప్రాజెక్టు కోసం సొంతూరు, స్థలాలు, పొలాలు, ఇళ్లు త్యాగం చేసిన తమ న్యాయపరమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రాజెక్టు ప్రారంభించి 16 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ నిర్వాసితులకు న్యాయం జరగలేదన్నారు. బడ్జెట్ ప్రతీ ఏడాది పెరుగుతున్నా.. నిర్వాసితుల సమస్యలు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం 460 జీవో ప్రకారం హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన ప్రాప్తికి ప్యాకేజీలు అందించాలని, ఇప్పటికీ కూడా 132 మందికి ప్యాకేజీలు పెండింగ్ ఉన్నాయన్నారు. సోషల్ ఎకనామిక్‌లో లేని 40 కుటుంబాలకు వెంటనే సర్వేచేసి పరిహారాలు అందజేయాలని వారి దృష్టికి తీసుకెళ్లారు. పునరావాస కాలనీల్లో ఇప్పటికీ రహదారులు, వీధి దీపాలు, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, నిర్వాసితుల రాష్ట్ర కార్యదర్శి గంగారపు సింహాచలం, సీపీఐ కార్యదర్శి చాపర వెంకటరమణ, దొర విజయ్ కుమార్, కిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలను బదిలీ చేయాలి



పాలక రంజిత్ కుమార్

పార్వతీపురం: పదమూడేళ్లుగా ఒకే కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలు కూడా వర్తించకుండా ఫెవిక్విక్‌లా అంటుకుని ఉన్న ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలను బదిలీ చేయాలని గిరిజన సంక్షేమ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఎస్‌కోట, బొబ్బిలి కేంద్రాల్లో గల గిరిజన కళాశాల వసతి గృహాల్లో ఉద్యోగం వచ్చినప్పటి నుంచి ఒకే చోట 13 ఏళ్లుగా హెచ్‌డబ్ల్యూఓలుగా పనిచేస్తున్న ఆ ఇద్దరినీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు బదిలీ చేయాలని డిమాండ్‌చేయనున్నట్లు తెలిపారు. ఆ ఇద్దరినీ డిప్యుటేషన్ పేరుతో అక్కడే కొనసాగిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. తాజా బదిలీల్లో కూడా మరో ఐదేళ్లు అక్కడే ఉండేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇదే అమలైతే ఒకే చోట 18 ఏళ్లు పనిచేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. జిల్లా అధికారులకు కూడా వర్తించని నియమాలు, నిబంధనలు వీరిద్దరికే ఎలా వర్తిస్తున్నాయో అధికారులకే ఎరుక అని ఈ ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలను గిరిజన ఆశ్రమ పాఠశాలలకు బదిలీ చేయకపోతే గిరిజన సంక్షేమ సంఘం తరఫున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### సెల్‌ఫోన్ల దొంగకు మూడు నెలల జైలు

విజయనగరం క్రైమ్: సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న వ్యక్తిని విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలసకు చెందిన బి.అజయ్ కుమార్ గతంలో పలు రైల్వే ప్లాట్‌ఫాంలలో సెల్‌ఫోన్‌లు బ్యాగులు దొంగతనాలు చేసేవాడని జీఆర్పీ ఎస్సై బాలాజీరావు చెప్పారు. ఈ మేరకు విజయనగరం స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీ చేస్తుండగా పట్టుకుని కేసు నమోదుచేసి కోర్టులో ప్రవేశపెట్టగా అజయ్ చేసిన నేరం రుజువు కావడంతో విశాఖపట్నం రైల్వేకోర్టు మెజిస్ట్రేట్ అనురాగ్ మూడు నెలల జైలుశిక్ష విధించారని ఎస్సై బాలాజీరావు వివరించారు.

### మహిళ మృతదేహం లభ్యం



పెద్దచెరువు ఆచంట గార్డెన్ వద్ద మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక బాలాజీ జంక్షన్ సమీపంలోని పెద్ద చెరువు సమీపంలోని ఆచంట గార్డెన్ వద్ద ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. పెద్ద చెరువు ఆచంట గార్డెన్ వద్ద మృతదేహం కనిపించిన వెంటనే వెంటనే స్థానికులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుల్స్‌ను ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. గుర్తు తెలియని మహిళకు 40 నుంచి 50 ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**ఆమె నా భార్య..**

విజయనగరం పెద్దచెరువు ప్రాంతంలోని ఆచంట గార్డెన్ వద్ద పోలీసులకు లభించిన మహిళ మృతదేహాన్ని గుర్తించి ఆమె తన భార్యేనంటూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మృతురాలి భర్త చంద్రన్ స్పష్టం చేశాడు. ఈ మేరకు నగరంలోని గంటస్తంభం వద్ద ఉన్న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తన భార్య ఆధార్ కార్డు తీసుకువెళ్లి లిఖిత పూర్వకంగా చంద్రన్ సమాచారం ఇచ్చాడు. భర్త చంద్రన్న ఇచ్చిన సమాచారంతో అనుమానాస్పద మృతి కాదని మతిస్థిమితం లేక ఆమె ఇంట్లోనుంచి వెళ్లిపోయిందని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

### పిడుగుపాటుతో మహిళ మృతి

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామానికి చెందిన వావిలపల్లి చంద్రమ్మ(57) బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతిచెందింది. పెసర మొక్కలు తీసేందుకు సాయంత్రం నాలుగు గంటల సమయంలో భర్త చిన్నంనాయుడితో పాటు ఆమె పొలానికి వెళ్లింది. కొంత సమయం అయిన తరువాత ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో భార్యాభర్తలు తిరిగి ఇంటికి వస్తుండగా బోలుబంద వద్ద పిడుగుపడడంతో ఆమె అక్కడికి అక్కడే మృతిచెందింది. మృతురాలిని చూసిన భర్త లబోదిబో మన్నారు. దీనిపై వీఆర్‌ఓ మానిక రిపోర్టు రాసి అందించారు.

### హెల్మెట్ తప్పనిసరి

తెర్లాం: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్‌ఐ భాస్కర రావు సూచించారు. ఎస్‌ఐ సాగర్‌బాబు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ద్విచక్ర వాహన చోదకులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని అన్నారు.

---



ఆర్చరీ శిక్షణలో పూర్ణచంద్

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందనడానికి ఉదాహరణగా నిలుస్తున్నాడు. రామభద్రపురం మండలంలోని కొత్తరేగ కుర్రాడు. ఆర్చరీలో జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరుస్తూ దూసుకుపోతున్నాడు. చిన్నతనంలోనే ఆర్చరీ క్రీడలో అపార ప్రతిభ కనబరుస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.



జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన పూర్ణచంద్‌కు మిఠాయి తినిపిస్తూ అభినందిస్తున్న తల్లిదండ్రులు



పూర్ణచంద్ గెలుచుకున్న మెడల్స్

# గురి తప్పని పూర్ణచంద్

- ఆర్చరీలో అద్భుతాలు సృష్టిస్తున్న యువకుడు
- అండర్ 15లో జాతీయస్థాయిలో రాణింపు
- గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారుడు

రామభద్రపురం: మండలంలోని కొత్తరేగ గ్రామానికి చెందిన కిలపర్తి పూర్ణచంద్ 9వ తరగతి చదువుతూ క్రీడారంగంలో రాణిస్తున్నాడు. జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ సాధించి దేశంలో జిల్లా కీర్తిని చాటాడు. ఈ కుర్రాడు 7వ తరగతి నుంచే పలుమార్లు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్‌లలో పాల్గొని గోల్డ్, బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ అందుకుని శభాష్ అనిపించుకున్నాడు. పతకాల్లో అధికశాతం గోల్డ్ మెడల్స్ అందుకుని అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఇటీవల మార్చి నెలలో గుంటూరులో నిర్వహించిన జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ఎన్‌టీపీసీ సంస్థ ద్వారా అండర్ 15 విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పూర్ణచంద్‌ను సంగారెడ్డి జిలా కలెక్టర్ క్రాంతి ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే 2021లో తమిళనాడులోని అండర్ 14 కేటగిరీలో జాతీయ ఇన్‌డోర్ ఆర్చరీ వ్యక్తిగత చాంపియన్ షిప్ గెలుచుకుని గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇంకా బాలుర మిక్స్‌డ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు. 2024లో హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నాడు. కొత్తరేగ గ్రామానికి చెందిన కిలపర్తి మురళీకృష్ణ ప్రథమ సంతానం పూర్ణచంద్. మురళీకృష్ణ హైదరాబాద్‌లో ఉంటూ చిన్న చిన్న వ్యాపారాలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. పూర్ణ చంద్ అక్కడే ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. 3వ తరగతి నుంచి ఆర్చరీ క్రీడలో రాణించేవాడు. ఆర్చరీ కోచ్ బండి స్వామి వద్ద శిక్షణ పొందుతూ ఆయన సలహాలు, సూచనలతో ముందుకెళ్తున్నాడు. ఆయా స్థాయిల్లో వివిధ పోటీల్లో పాల్గొని సుమారు 26 మెడల్స్, ట్రోఫీలు దక్కించుకున్నాడు. విద్యలో కూడా తరగతిలో టాప్ 5లో రాణిస్తున్నట్లు తండ్రి మురళీకృష్ణ తెలిపారు. పూర్ణచంద్‌కు మహారాష్ట్రలోని పూణెలో ఉన్న ఇండియన్ ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్ యాజమాన్యం ఉచిత విద్యతో పాటు ఆర్చరీలో మరింత శిక్షణ ఇచ్చి ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనేందుకు తీసుకు వెళ్లారని తెలిపారు.



గోల్డ్ మెడల్ సాధించిన పూర్ణచంద్‌ను సత్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

**ఒలింపిక్స్‌లో మెడల్ సాధనే లక్ష్యం..**



నేను నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పలుమార్లు పాల్గొని సుమారు 26 గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాను. ఇండియన్ ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో చదువుతో పాటు ఆర్చరీలో మరింత శిక్షణ పొంది ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

కిలపర్తి పూర్ణచంద్, ఆర్చరీ క్రీడాకారుడు

**ఆనందంగా ఉంది..**



నా కొడుకు జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించాడన్న సంతోషం కంటే మహారాష్ట్రలోని పూణెలో ఉన్న ఇండియన్ ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్ యాజమాన్యం ఉచిత విద్యతో పాటు ఆర్చరీలో మరింత శిక్షణ ఇచ్చేందుకు తీసుకెళ్లడం మరింత ఆనందంగా ఉంది. 3వ తరగతి నుంచి బాబు ఆర్చరీ అంటే ఇష్టపడేవాడు. కోచ్ బండి స్వామి చక్కని శిక్షణతో పాటు సలహాలు సూచనలు ఇవ్వడంతో మరింత రాటు దేలాడు. అంతర్జాతీయ స్థాయి ఒలింపిక్స్‌లో ప్రథమ స్థానం సాధించి మెడల్ గెలిస్తే మరెంతో సంతోషంగా ఉంటుంది.

కిలపర్తి మురళీ కృష్ణ, పాతరేగ, రామభద్రపురం మండలం

---

## జిల్లాలో కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటన



మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన బృంద సభ్యులు

- మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన బృంద సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లాలోని జలవనరులను పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోడానికి కేంద్ర జలశక్తి అభియాన్ బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. తొలుత కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వారి పర్యటన వివరాలను తెలియజేశారు. జిల్లాలో తోటపల్లి, తారక రామ తీర్థసాగర్ ప్రాజెక్టులను సందర్శిస్తామని, కోటగండ్రేడులో జలజీవన్ మిషన్ లబ్ధిదారులతో ముఖాముఖీ మాట్లాడతామని కలెక్టర్‌కు తెలియజేశారు. బృందంలో మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ తరుణా దోలియ, కేంద్ర వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ నిఖిల్ జెఫ్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు శాస్త్రవేత్త డి.అనంతరావులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కవిత, ప్రాజెక్ట్ డీఈఈ గోవింద రావు, తోటపల్లి ఎస్‌ఈ స్వర్ణకుమార్, ఈఈ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

**వెనుకబడిన జిల్లాకు నిధులు మంజూరు చేయాలి**

కేంద్ర జలశక్తి అభియాన్ బృందంతో కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ మాట్లాడుతూ విజయనగరం వెనుకబడిన జిల్లా అని, కేంద్ర ప్రాజెక్టుల కోసం నిధులను కేటాయించాలని కోరారు. తారకరామ తీర్థ సాగర్‌పై బృందానికి వివరిస్తూ ఈ ప్రాజెక్టు కోసం రూ.800 కోట్లతో అంచనా ప్రతిపాదనలు పంపగా రూ.100 కోట్లు మాత్రమే ఇప్పటివరకు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని మిగిలిన నిధులు మంజూరు చేస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు.

## అధికారిక లాంఛనాలతో ఆర్మీ జవాను అంత్యక్రియలు

బాడంగి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆర్మీ జవాన్ సత్యం మృదేహానికి అధికారిక లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు జరిగాయి. బొబ్బిలి మండలం పారాది సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాడంగి మండలంలోని ముగడ గ్రామానికి చెందిన జవాను తూముల సత్యం మృతిచెందిన విషయం తెలిసిందే. బొబ్బిలిలో శవపంచాయతీ అనంతరం సత్యం మృతదేహాన్ని స్వగ్రామం ముగడ తరలించారు. బుధవారం ఉదయం ఆయన పనిచేస్తున్న దగ్గర నుంచి మిలటరీ అధికారి, పోలీసులు వ్యాన్‌పై ముగడ గ్రామానికి చేరుకుని సత్యం మృతదేహాన్ని పూలమాలలతో అలంకరించి, మృతదేహంపై జాతీయజెండా అవగతం చేసి గాలిలోకి కాల్పులు జరిపి గౌరవవందనం చేశారు. అనంతరం అంత్యక్రియలకు శ్మశానానికి పోలీసులే మృతదేహాన్ని మోసుకుని వెళ్లారు. అంతకుముందు భార్య నాగరత్నానికి దహన సంస్కారాల కోసం ప్రభుత్వం సమకూర్చిన నగదును అందజేశారు. ఆమె కుమార్తె హిమబిందుతో కలిసి మృతదేహాన్ని కడసారిగా చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.



సైనికుడు సత్యం మృతదేహాన్ని అంత్యక్రియలకు సిద్ధం చేసిన ఆర్మీ సిబ్బంది

కుమారుడు అరవింద్ తండ్రికి తలకొరివి పెట్టగా దహన సంస్కారాలు పూర్తిచేశారు. మృతుడి అన్నదమ్ములతో పాటు బంధువులు, ప్రజలు పెద్దసంఖ్యలో గుమిగూడి నివాళులర్పించారు. తహసీల్దార్ సుధాకర్, ఎస్సై తారకేశ్వరరావు, వీఆర్‌ఓ దేవి, కార్యదర్శి సూర్యారావు ప్రభుత్వం తరఫున హాజరయ్యారు.

---

## రక్తహీనతతో ఎవరూ బాధ పడకూడదు



ఎమ్మార్ నగరంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాలోని ఏ ఒక్కరూ రక్తహీనతతో బాధపడకూడదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం మండలం ఎమ్మార్‌నగరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన రక్తహీనత నివారణ కమిటీ (అనీమియా యాక్షన్ కమిటీ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి సచివాలయం పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణులు, డెలివరీ కేసులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని, అలాగే గర్భిణులకు చేయాల్సిన నెలవారీ పరీక్షలు, ప్రసవం అనంతరం పసిపిల్లలకు సమయానుకూలంగా ఇవ్వాల్సిన ఇంజక్షన్లు తదితర వాటిని ఏఎన్‌ఎంలు బాధ్యతాయుతంగా చేయాలని ఆదేశించారు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు**

అనీమియా లోపంతో బాధపడుతున్న వారిపట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని కలెక్టర్ హెచ్చరించారు. అనీమియా నివారణకు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సక్రమంగా పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం ప్రజలతో కలిసి టీబీ వ్యాధి పట్ల శ్రద్ధ వహించండి, టీబీ రహిత భారత్‌కు సహకరించండి అనే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, తహసీల్దార్ వై.జయలక్ష్మి సీడీపీఓ బి.శ్రీనివాసరావు, డాక్టర్ పి.గోపాల్ కృష్ణ, సర్పంచ్ త్రినాథ రావు, వైద్యసిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి సీఐ కె.నారాయణరావు సూచించా రు. మండలంలోని ఎస్.సీతారాంపురంలో యువకులు, విద్యార్థులు, పెద్దలకు మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, మరికొందరికి అవగాహన కల్పించాలన్నారు. చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు.కొరియర్ పేరుతోనూ మోసాలు జరుగుతున్నాయని, చైల్డ్ ఫోర్నోగ్రఫీ,డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్,లాటరీల పేరుతోను, డెబిట్ కార్డు మోసాలు,ఇన్‌స్టాగామ్ మోసాలు, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే రూ.10 కోట్లు ఇస్తామని,వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయింగ్ తదితర నేరాలకు పాల్పడుతున్నారన్నారు.ఇటీవల రామభద్రపురం గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఫేక్ ఇన్‌స్టాగామ్ ద్వారా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అతి తక్కువ సమయంలోనే పోలీసులకు చిక్కాడన్నారు. నింది తుడిపై సైబర్, పోక్సో కేసు నమోదుచేశామని, ఇప్పుడు జైల్ జీవితం అనుభవిస్తున్నాడని తెలిపారు. మొబైల్స్‌కు వచ్చే లింక్‌లపై క్లిక్ చేయొద్దని, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## టన్ను పీడీఎస్ బియ్యం పట్టివేత

- డీలర్ల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టిన నాలుగు రోజులు బట్టబయలైన అక్రమరవాణా

బొండపల్లి: గతప్రభుత్వం పారదర్శకంగా, ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టిన సంగతి విదితమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటి రేషన్ సరుకుల పంపిణీకి మంగళం పాడాలని మొదటి నుంచి ఆలోచన చేస్తూ అందుకు అనుగుణంగా ఏడాది వరకు కొనసాగించి జూన్ నెల నుంచి రేషన్ షాపుల్లో డీలర్ల ద్వారానే రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టి అమలు చేయడం ప్రారంభించింది. అందులో భాగంగా రేషన్ షాపుల డీలర్లు, గతంలో అక్రమంగా రేషన్ బియ్యం ఇతర సరుకులను బ్లాక్ మార్కెట్‌లోకి తీసుకువెళ్లి సొమ్ము చేసుకున్న వారు..తమ పాత అక్రమాలకు మళ్లీ పాల్పడుతూ పేద ప్రజలకు అందాల్సిన రేషన్ సరుకులను పక్కదారి పట్టించే పనిలో నిమగ్నమయ్యారు.

**నాలుగు రోజులకే అక్రమ రవాణా**

రేషను సరుకులను డీలర్ల ద్వారా పంపిణీని కూటమి ప్రభుత్వం ప్రారంభించి నాలుగు రోజులు కూడా పూర్తి కాకముందే, డీలర్లు, అక్రమార్కులు కుమ్మక్కై అక్రమమార్గంలో రేషన్ సరుకులను తరలించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా విజయనగరంలోని గుంకలాం నుంచి గొట్లాం బైపాస్ రోడ్డు మీదుగా గజపతినగరం తరలిస్తున్న టన్ను పీడీఎస్ బియ్యాన్ని బుధవారం వేకువ జామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలంతో పాటు సివిల్ సప్లయిస్ డీటీ కె.తిరుపతిరావు అధికారులతో కలిసి పట్టుకుని బొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.45వేల 500 ఉంటుందని, ఆటోలో తరలిస్తుండగా ఆటో యజమాని గేదేల ఈశ్వర్రావుతో పాటు సహాయకుడు దాసరి శ్రీనును అదుపులోనికి తీసుకుని విచారణ చేయగా గజపతినగరానికి చెందిన ముప్పిడి గణేష్‌కు బియ్యం తరలిస్తున్నట్లు తెలపడంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్న అందిరినీ అదుపులోకి తీసుకుని వారిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



అక్రమార్కులతో పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు

---

## కలెక్టర్ కారును ఢీకొట్టిన వ్యక్తి

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కారును అదే జిల్లా మక్కువకు చెందిన వ్యక్తి వెనుక నుంచి ఢీకొట్టాడు. కలెక్టర్ కారు బుధవారం విజయనగరం వైపు వెళ్తుండగా మక్కువ బీసీ కాలనీకి చెందిన నానిబాబు స్పీడ్ బ్రేకర్‌ల వద్ద స్లో చేయకుండా వచ్చి ఢీకొట్టాడు. దీంతో తహసీల్దార్ ఎం. శ్రీనుకు కలెక్టర్ సమాచారం ఇవ్వగా ఆయన ఆర్‌ఐ రామ్ కుమార్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రామ్‌కుమార్, ఏఎస్సై ఆదిత్యలు ఘటనా స్థలానికి చేరుకుని నిర్లక్ష్యంగా కారును ఢీకొన్న వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు.

## ర్యాపిడ్ కిట్లే దిక్కు..!

- ఇంకా సరఫరా కాని ఆర్‌టీపీఎస్ కిట్లు
- పలు జిల్లాల్లో పెరుగుతున్న కోవిడ్ కేసులు

విజయనగరం ఫోర్ట్: కోవిడ్ వ్యాధి తీవ్రత ఏవిధంగా ఉంటుందో ప్రజలం దరికీ తెలుసు, కరోనా సోకితే చాలా ఇబ్బంది పడతారు. కరోనా వ్యాధికి సకాలంలో చికిత్స చేయించుకోకపోతే ప్రాణాలు మీదికి వచ్చే ఆస్కారం ఉంది. నాలుగేళ్ల కిందట కోవిడ్ వ్యాధి యావత్ ప్రపంచాన్ని తీవ్రంగా వణికించింది. దీంతో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కూడా విధించారు. లాక్ డౌన్ కారణంగా ప్రజలు అంతా ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పటికీ ఆ రోజులు తలుచుకుంటే ప్రజలు వణికిపోతారు. కొద్ది రోజులుగా కరోనా వ్యాప్తి మళ్లీ మొదలైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు కరోనా లక్షణాలు ఉన్న వారందరికీ పరీక్షలు చేయాల్సి ఉంది. కోవిడ్ కేసులు ఎక్కువవుతున్నప్పటికీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**జిల్లాకు రాని ఆర్‌టీపీసీఆర్ కిట్లు**

కరోనా వ్యాధి కచ్చితమైన నిర్ధారణ ఆర్‌టీపీసీఆర్ పరీక్ష ద్వారా అవుతుంది. గతంలో కూడా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేసి కోవిడ్ రోగులను నిర్ధారించేవారు. అంతటి ప్రాధాన్యం గల ఆర్‌టీపీసీఆర్ పరీక్షల కిట్‌లను కూటమి ప్రభుత్వం ఇంతవరకు జిల్లాకు సరఫరా చేయలేదు. దీంతో ప్రభుత్వ తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ర్యాపిడ్ కిట్ ద్వారా కోవిడ్ టెస్టు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

**ర్యాపిడ్ కిట్లతో కోవిడ్ పరీక్షలు**

కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో రోగుల్లో వ్యాధి నిర్ధారణ కచ్చితంగా తెలుస్తుందో తెలియదోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి ర్యాపిడ్ టెస్టింగ్ కిట్ల ద్వారా కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ల్యాబొరేటరీలను రోగులు ఆశ్రయిస్తున్నారు. సొంత డబ్బులతో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేసుకుంటున్నారు.

**ఆర్‌టీపీసీర్ కిట్లు వస్తాయి**

కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి ప్రస్తుతం ర్యాపిడ్ కిట్లుతో పరీక్ష చేస్తున్నాం. ఆర్‌టీపీసీఆర్ కిట్లు ఒకటి, రెండు రోజుల్లో జిల్లాకు వస్తాయి.

డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

## పుడమి పరవశించాలి

- పచ్చదనం ఫరిడవిల్లాలి
- ప్రకృతితో సహజీవనమే పర్యావరణ పరిరక్షణ
- నేడు పర్యావరణ దినోత్సవం

విజయనగరం గంటస్తంభం: ధరణీమాత భగభగమండుతోంది. కన్నబిడ్డలు చేస్తున్న అకృత్యాలు భరించలేక ఆవేదన చెందుతోంది. లక్షలకొద్దీ హిరణాక్ష్యులను చూసి తల్లడిల్లుతోంది. భూమాత పెడబొబ్బలు మనకు వినబడవు. వాహనాల రొద వాటిని మింగేస్తోంది. ధరణి కన్నీరు కారుస్తోంది. మనకు కనబడదు. ఫ్యాక్టరీల పొగమబ్బులు కమ్ముకున్నాయి. అభివృద్ధి ముసుగు వేసుకున్న రక్కసి వికట్టాట్టహాసం చేస్తోంది. అన్నిటికీ ఒకటే సమాధానం గ్లోబల్ వార్మింగ్. ఇప్పుడు మానవాళి మేలుకోవాల్సిన సమయం వచ్చింది. ఉపేక్షిస్తే ఆ తల్లి మహోగ్రరూపం దాలుస్తుంది. అప్పుడంతా ప్రళయమే.

మన కాళ్లకింద వెయ్యి టన్నుల న్యూక్లియర్ బాంబులున్నాయి. వందల కొద్దీ హైడ్రోజన్ బాంబులున్నాయి. అవి ఏ క్షణంలోనైనా పేలవచ్చు. అదే జరిగితే భూమీమీద ఉన్న సమస్త జంతుజాలం, చెట్లు చేమలు నాశనమవుతాయి. భూమి ఓ మరుభూమిగా మారిపోతుంది. నివాసయోగ్యంగా లేని గ్రహంగా మిగిలిపోతుంది. ఇది మండిపోతున్న ధరణి భవిష్యవాణి. మనం చేసే తప్పిదాలకు ప్రకృతి అప్పుడప్పుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నా అదిచ్చే ప్రమాద సంకేతాలను గుర్తించలేకపోతున్నాం. అసలు భూమాతను పరిరక్షించుకోవాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్న ఆలోచన ఇప్పుడొచ్చిందేమీ కాదు.అర్ధశతాబ్దం కిందటే ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించింది. సమితి జనరల్ అసెంబ్లీ జూన్ 5, 1972న పర్యావరణ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి ఏడాది ఇదేరోజున ఏదైనా ఓ నగరంలో అంతర్జాతీయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది.



2025 థీమ్"బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్"

పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని ప్రజలు, ప్రభుత్వం గుర్తించి తగు చర్యలు చేపట్టేలా ప్రోత్సహించడమే పర్యావరణ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. ఇక అప్పట్నుంచి ప్రతి ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నాం. విషపూరిత వాయువులు వాతావరణంలో ఎక్కువ కావడంతో క్రమంగా భూమి కేడెక్కుతోంది. అడవులు, జలవనరులు తగ్గిపోతున్నాయి.

**2025 థీమ్"బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్"**

2025లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న జరుపుకుంటారు. ఈ సంవత్సరం థీమ్ ''ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయండి'' ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణానికి, జీవులకు కలిగే నష్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, దీనిని అంతం చేయడానికి కృషి చేయడం.


**ప్లాస్టిక్ భూతం..తరిమేద్దాం**

భూమిని పట్టిపీడిస్తున్న ప్రమాదకర వస్తువు ప్లాస్టిక్. 100 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వ్యాపారులు మాత్రం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్‌ను కొంతమంది వ్యాపారులు రోడ్డుపైనే తగులబెడుతున్నారు. దీనివల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో రోజుకు 150 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. విజయనగరం పట్టణంలో సేకరించిన చెత్త నుంచి ఎరువు, ఇంధనం తయారు చేసే ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.



ప్లాస్టిక్ నిర్మూలన అవసరం-పచ్చదనం ముఖ్యం

**మొక్కలు నాటి సంరక్షించాలి**



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలి. ఈ సంవత్సరం జిల్లాలో 20 లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నాం. మొక్కల పెంపకం వల్ల పర్యావరణం సమతుల్యత పెరిగి మానవ మనుగడకు ప్రాణాధారం అవుతాయి. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి. స్వచ్ఛమైన, ఆహ్లాదరకమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలి.

ఆర్.కొండల రావు, జిల్లా అటవీ శాఖ అధికారి